కొండవాలు.. గుండె గుభేల్



62వ వార్డులో వర్షాలకు నేలజారుతున్న కొండవాలు ప్రాంతం

- వర్షాలకు భీతిల్లుతున్న కొండవాలు ప్రాంత ప్రజలు
- కలగానే మిగిలిన రక్షణ గోడల నిర్మాణం
- చినుకు పడితే కునుకు కరువు



62వ వార్డు కొండవాలులో జారి పడుతున్న బండరాళ్లను పరిశీలిస్తున్న నాయకులు



యారాడ వెళ్లే మార్గంలో మట్టి జారి, కిందికి దొర్లుతున్న బండరాళ్లు

సింధియా: చినుకు పడితే కొండవాలు ప్రాంత ప్రజలకు కునుకు కరువవుతోంది. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాలైన జనతాకాలనీ, అంబేడ్కర్ కాలనీ, దుర్గానగర్, ఎస్సార్ కాలనీ, త్రినాథపురం, కాకరలోవ, చింతల్లోవ, క్రాంతినగర్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు వర్షాలు కురిసిన ప్రతీసారి ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

- పారిశ్రామిక ప్రాంతంలోని జీవీఎంసీ 59, 60, 61, 62, 63 వార్డుల్లో దాదాపు లక్షన్నర మంది జీవిస్తున్నారు. వీరిలో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఉన్నారు. వీరిలో అధికశాతం నిరుపేదలే కావడంతో, అద్దె తక్కువ ఉంటుందని కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. కానీ వర్షం పడిన ప్రతీసారి గుండెలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. మట్టి పెళ్లలు విరిగి ఇళ్లపై పడడం, ఇళ్లకు వెళ్లడానికి సరైన మెట్లు లేక జారిపడడం, విద్యుత్ లైట్లు అస్తవ్యస్తంగా ఉండడంతో కరెంటు షాకులు కొట్టడం, రక్షణ గోడలు లేక బండరాళ్లు దొర్లడం, విషసర్పాలు, క్రిమికీటకాలు ఇళ్లలోకి ప్రవేశించడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు.
- గతంలో 59వ వార్డులో 3 రోజులు కురిసిన భారీ వర్షాలకు గణపతినగర్ కొండపై ఉన్న ఓ ఇంటిపై బండరాళ్లు దొర్లిపడడంతో మూడేళ్ల బాలుడు, ఓ గర్భిణి మృతి చెందిన సంఘటన కొండవాలు ప్రాంతవాసులను ఆందోళనకు గురి చేసింది. ఆ సంఘటనను పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఇంకా మరువలేదు. ఇటువంటి సంఘటనలు ఎక్కడో ఒక చోట తరచూ జరుగుతున్నా ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించాలని.. కొండవాలు ప్రాంతాల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా నిద్రపోలేం



సాధారణ రోజుల్లో ఎలా ఉన్నా, వర్షాకాలంలో మాత్రం కంటి మీద కునుకు ఉండడం లేదు. విషసర్పాలు ఇళ్లలోకి చేరడం, వర్షపునీరు లోనికి రావడంతో పాటు బండరాళ్లు దొర్లుతాయామోనని భయంగా ఉంటుంది. ప్రభుత్వం చొరవ తీసుకుని రక్షణ గోడలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– మహేశ్వరి, 63వ వార్డు

రక్షణ గోడలు నిర్మించాలి



వర్షాలు పడితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటోంది. రక్షణగోడలు లేక బండరాళ్లు దొర్లుతున్నాయి. ప్రభుత్వ అధికారులు స్పందించి, రక్షణ గోడల నిర్మించాలి. మాకు రక్షణ కల్పించాలి.

– సోముబాబు, 62వ వార్డు

క్లుప్తంగా

ఆలయానికి కలశ బిందెల బహూకరణ



దాతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం శ్రీ దుర్గాలమ్మ బంగారమ్మ ఆలయానికి 9 రాగి కలశ బిందెలను కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎం.ఎస్.ఎన్.పాత్రుడు, విజయలక్ష్మి దంపతులు విరాళంగా అందజేశారు. అమ్మవారిని మంగళవారం దర్శించుకున్న వారు, బిందెలను ఆలయ నిర్వాహకులైన త్రివేణి గ్రామాభ్యుదయ సేవా సంఘం సభ్యులకు అందించారు. వీటిని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో వినియోగించాలని కోరారు. అలాగే, ఆలయ ప్రాంగణంలో నిర్వహించే అన్నసంతర్పణకు రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దాతలకు అమ్మవారి ప్రసాదం అందించి, సత్కరించారు.

గెడ్డలో పూడిక తొలగింపు



పూడిక తొలగింపును పర్యవేక్షిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం, జవహర్‌నగర్ ప్రాంతాల్లోని గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను మంగళవారం తొలగించారు. ఇక్కడ గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోవడంతో, వర్షాలకు గెడ్డలో నీరు నిలిచిపోయింది. దీనిపై స్థానికులు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కు సమాచారం ఇవ్వడంతో, ఆయన సిబ్బందితో ఆ ప్రాంతానికి వచ్చి పూడికలను తొలగింపజేశారు.

శ్రీరామ్‌నగర్‌లో జెడ్సీ పర్యటన



శ్రీరామ్‌నగర్ గెడ్డను పరిశీలిస్తున్న జెడ్సీ రాము

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో జోన్–5 జెడ్సీ రాము మంగళవారం పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇక్కడ గెడ్డ పొంగి, శ్రీరామ్‌నగర్ కాలనీలో పలు ఇళ్లలో నీరు చేరి, ఆ ప్రాంతం ముంపునకు గురైన సంగతి తెలిసిందే. దీనిపై సాక్షితో పాటు పలు పత్రికల్లో వార్తా కథనాలు రావడంతో స్పందించిన అధికారులు మంగళవారం ఉదయం ముంపు ప్రాంతాలను పరిశీలించారు. కాలనీవాసులనడిగి సమస్య తెలుసుకున్న అనంతరం గెడ్డ వద్దకు వెళ్లి పరిశీలించారు. జెడ్సీ మాట్లాడుతూ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటులు

మల్కాపురం: గాజువాక మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ వేడుకల్లో పలువురు వర్ధమాన నటులు, రచయితలు, డాన్సర్లు, దర్శకులు పాల్గొని కేక్ కట్ చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాల కుమార్, కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సభ్యుల సహకారంతో వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించామన్నారు. సభ్యుల సంక్షేమానికి తాము ఎప్పుడూ ముందుంటామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, సినీ నటులు కుమారి, మంగ, తిలక్ ప్రసాద్, మురళి, తేజస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

సింధియా: 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో నివాసముంటున్న సూరిశెట్టి కుమారి కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చికిత్స కోసం చాలా డబ్బు ఖర్చవడంతో, ఆర్థిక పరిస్థితి బాగాలేక సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. రూ.1,34,000 మంజూరుకావడంతో, ఆ చెక్కును ప్రభుత్వ విప్ గణబాబు కుమారి కుటుంబసభ్యులకు అందజేశారు. 62వ వార్డు అధ్యక్షుడు మాలినాయుడు, జోగిబాబు, యూనిట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

‘స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం’



అనిల్‌కుమార్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు

మల్కాపురం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఊరుకోబోమని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనీల్‌కుమార్ హెచ్చరించారు. అవసరమైతే ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది త్యాగాలు, పోరాటాల ఫలితంగా స్టీల్‌ప్లాంట్ ఏర్పడిందన్నారు. నేడు కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులు ప్రైవేటీకరణ చేయాలని అడుగులు వేస్తున్నారని విమర్శించారు. ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రం అడుగులు వేస్తుంటే, దానికి రాష్ట్రంలోని కూటమినాయకులు మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ వలన వేలాది మంది కార్మికులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఎన్నికలలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారని, ఆ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కూటమి నాయకులకు పౌరుషం ఉంటే తమ మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ప్లాంట్‌లో 32 విభాగాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు.

‘కూటమి నేతల హామీలన్నీ బూటకమే..’



సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం

మల్కాపురం: కూటమి నేతలు చెప్పే మాటలు ఒకటి.. చేతలు మరొకటి అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భోగవల్లి నాగభూషణం అన్నారు. ఈ నెల 24న 61వార్డు మల్కాపురంలో ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’ కార్యక్రమం జరగనుండటంతో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పిలక రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్కాపురం, రెడ్డివీధి రామాలయం వద్ద గల సామాజిక భవనంలో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాగభూషణం మాట్లాడుతూ లక్ష ఉద్యోగాలిచ్చి నిరుద్యోగ యువతను ఆదుకుంటానని గత ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారని, ఇప్పుడు ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడే పరిస్థితి వచ్చిందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ డబ్బులు రాక.. తల్లికి వందనం డబ్బుల పంపిణీలో కోతలు, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాలకు షరతులు .. ఇలా ప్రతీ హామీ ఓ మోసం ఉందన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లి, వారి పక్షాన ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. ఈ నెల 24న నిర్వహించనున్న కార్యక్రమాన్ని ఐక్యంగా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బూస అప్పలరెడ్డి, కొల్లి నూకరెడ్డి, నూనెల మహేష్ యాదవ్, మధుబాబు, గోపిరాజు, చట్టి నూకరాజు యాదవ్, పీలా అనంత్‌కుమార్, పిలక వరలక్ష్మి, శంఖరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రైలు ఢీకొని వృద్ధుడి మృతి



రైలు ప్రమాదంలో మృతి చెందిన వృద్ధుడు

గోపాలపట్నం: సింహాచలం నార్త్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో కొత్తపాలెం వద్ద రైల్వే ట్రాక్‌పై రైలు ఢీకొట్టిన ప్రమాదంలో మంగళవారం ఓ వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది తెలిపిన వివరాలివి.. గోపాలపట్నం నాగేంద్ర కాలనీలో నంబూరి చంద్రశేఖర్ (73) కుమారుడు శ్రీనివాసరావుతో కలసి నివాసముంటున్నాడు. రెండు రోజుల నుంచి తండ్రి కనిపించడం లేదని వెదుకుతున్న కుమారుడికి నార్త్ సింహాచలం వద్ద రైలు ట్రాక్‌పై పడి ఉన్నాడని సమాచారం రావడంతో వెళ్లి చూశాడు. తన తండ్రిగా గుర్తించి, జీఆర్‌పీ పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి కుమారుడు గోపాలపట్నం హైస్కూల్ వద్ద టిఫిన్ బండి నడుపుతున్నాడు. తండ్రి చంద్రశేఖర్ తరచూ కొత్తపాలెంలో ఉంటున్న కుమార్తె వద్దకి, యల్లపువానిపాలెంలో ఉంటున్న సోదరి వద్దకు వెళ్లి వస్తుంటాడని తెలిపారు. అయితే ఉదయం బహిర్భూమికని వచ్చి ప్రమాదానికి గురై ఉంటాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇటీవలే చంద్రశేఖర్ భార్య అనారోగ్యంతో మరణించారని, ఇప్పుడు చంద్రశేఖర్ కూడా మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన



వాహన చోదకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ దాశరథి

మర్రిపాలెం: హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారికి కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. మంగళవారం మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి సిబ్బందితో కలిసి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిని ఆపి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ఇద్దరూ హెల్మెట్ ధరించడం శ్రేయస్కరమన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇలా వదిలేస్తే ఎలా?



చీలికలు చేయకుండా వదిలేసిన ఖాళీ బొండాలు

గోపాలపట్నం: అసలే వర్షాకాలం.. వ్యాధులు ముసిరేకాలం. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవలసిన సమయం. కానీ కొందరి నిర్లక్ష్యం ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది. జీవీఎంసీ 91వ వార్డు బాజీ జంక్షన్ నుంచి పాత గోపాలపటణం వెళ్లే దారిలో ఒక వ్యానులో భారీగా డంప్ చేసిన ఖాళీ కొబ్బరి బొండాలు దర్శనమిచ్చాయి. ఇక్కడికి సమీపంలో ఉండే డంపర్‌బిన్‌లో వేసినవే కాకుండా, అదనంగా ఇక్కడే ఇలా వదిలేస్తున్నారు. వాస్తవానికి కొబ్బరిబొండాలను నాలుగు ముక్కలుగా చీల్చి నీరు నిల్వ లేకుండా చేయాలని అధికారులు సూచిస్తున్నారు. కానీ అది ఎక్కడా ఆచరణలో కానరావడం లేదు. నిత్యం ఇక్కడ ఇదే పరిస్థితి ఉంటోందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సందడిగా ఉట్టి సంబరం



ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణుడి వేషధారి

మల్కాపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి వద్ద గల శ్రీకృష్ణాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు పాల్గొని, స్వామికి పాలు, పెరుగుతో అభిషేకం చేశారు. అనంతరం ఇక్కడ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉట్టి సంబరంలో చిన్ని కృష్ణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక యువకులు ఉట్టి కొట్టేవారిపై పసుపు నీటిని చిమ్ముతూ, సందడి చేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందిస్తున్న దాత రాంబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని శంకర మఠానికి చెందిన పి.రాంబాబు రూ.లక్ష 11 వేల 116 విరాళాన్ని మంగళవారం అందించా రు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

జోన్–5 ఏసీపీగా తిరుపతిరావు



తిరుపతిరావు

కంచరపాలెం: జ్ఞానాపురం జోన్–5 టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా ఎం.తిరుపతి రావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న శాస్త్రి జీవీఎంసీ జోన్–2కు ఏసీపీగా బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏసీపీ తిరుపతిరావు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రామును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ తిరుపతిరావు మాట్లాడుతూ జోన్ పరిధి ఉత్తర, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గాల వార్డులకు సంబంధించి అక్రమ నిర్మాణాలుపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. టౌన్ ప్లానింగ్ టీపీవోలు, సచివాలయ టీపీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.


‘స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపేయాలి’



ఫార్మాసిటీలో నిరసన తెలుపుతున్న సిటు నాయకులు, కార్యకర్తలు

పరవాడ: స్టీల్ ప్లాంట్‌ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిటు ఆధ్వర్యంలో ఫార్మాసిటీలో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ ఈవోఐ పేరుతో బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని 44 విభాగాలను ప్రైవేటీకరించే చర్యలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్‌లు జోక్యం చేసుకోవాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిచిపోయిందని, దీన్ని లాభాల బాటలో తీసుకొచ్చి కార్మికులకు న్యాయం చేస్తామని ప్రకటించిన రాష్ట్ర నేతలు ప్రైవేటీకరణపై నోరు విప్పకపోవడం విచారకరమన్నారు. ప్లాంటులోని కీలక విభాగాలను 44 ముక్కలు చేసి ప్రైవేట్ వ్యక్తులకు ధారదత్తం చేయడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సిటు నాయకులు అప్పలరాజు, చిట్టిబాబు, రమణ, శేషు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఐవీఎఫ్ సెంటర్ల తనిఖీలు



నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు, ఇతర వైద్యులు మంగళవారం నగరంలోని పలు ఐవీఎఫ్ సెంటర్లను తనిఖీ చేశారు. గిగ్లెస్ ఒమ్ని ఆర్కే, నోవా ఐవీఎఫ్, లాన్సెట్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రికార్డులు, ఇతర పత్రాలను అధికారులు పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమందికి సంతానోత్పత్తి చికిత్స చేశారు వంటి వివరాలను డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ గది బయట, లోపల, రిసెప్షన్‌లో ధరల పట్టికను, ఇతర బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, ప్రతీ ఫారం–ఎఫ్ ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలని ఆదేశించారు. ఫారం–ఎఫ్‌పై గర్భిణి, స్కానింగ్ చేసే వైద్యుడి సంతకాలు ఉండాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన గడువు కంటే రెండు నెలల ముందుగానే రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చురుగ్గా సీహెచ్‌సీ సుందరీకరణ



మొక్కలు నాటుతున్న పనివారు

గోపాలపట్నం: గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో పాటు వుడా కాలనీ పార్క్‌లో, గోపాలపట్నం హైస్కూల్లో సుమారు రూ.17లక్షల జీవీఎంసీ నిధులతో పనులు చేస్తున్నారు. ఈ పనులను ఏఈ దాసి బాబు పర్యవేక్షించారు. ఆస్పత్రి ఆవరణలో మట్టి నింపి అందమైన పూలమొక్కలు నాటుతున్నారు. ఈ పనులు పూర్తయితే ఆస్పత్రి అందంగా తయారవుతుందని, ఆరోగ్యకర వాతావరణం ఉంటుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి బయట స్థానిక పర్యావరణ ప్రేమికులు మొక్కలు పెంచుతున్నారు. ఇప్పుడు లోపల కూడా అందంగా తీర్చిదిద్దడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నత్తనడకన భూగర్భ విద్యుత్ పనులు



సింహాచలం రైల్వే స్టేషన్‌లో గోతులు తవ్వి వదిలేశారిలా..

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా రైల్వే అధికారులు చేపట్టిన భూగర్భ విద్యుత్ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గోతులు తవ్వి నెలరోజులుగా ఇలానే వదిలేశారని తెలిపారు. రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ చేసేందుకు వెళ్లే మార్గం గోతులు, మట్టికుప్పలతో ఇరుగ్గా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మట్టికుప్పల వల్ల వాహనాలు స్కిడ్ అవుతున్నాయని, అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

అత్యున్నత ప్రమాణాలే దేశాభివృద్ధికి కీలకం

బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మీనాక్షి గణేశన్



మీనాక్షి గణేశన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: అత్యున్నత ప్రమాణాలతో ఉత్పత్తులను తయారు చేయడం దేశాభివృద్ధిలో కీలకమని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (సౌత్) మీనాక్షి గణేశన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం సమావేశ మందిరంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాలతో సంయుక్తంగా బీఐఎస్ నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ‘స్టాండర్డైజేషన్ అండ్ కన్‌ఫార్మిటీ అసెస్‌మెంట్’ను మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక సంస్థకు, ఒక వ్యవస్థకు శక్తినిచ్చేవి కేవలం ప్రమాణాలేనని అన్నారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా అధ్యాపకులకు భారతీయ, అంతర్జాతీయ ప్రమాణాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 2023లో ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఐఎస్‌తో అవగాహన ఒప్పందం చేసుకొని విభిన్న కార్యక్రమాలను, పరిశోధనా ప్రాజెక్టులను నిర్వహిస్తోందన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రమాణాలను కరిక్యులంలో భాగంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా త్వరలో చర్యలు చేపడతామని చెప్పారు. వర్సిటీలో బీఐఎస్ శాఖలను స్థాపించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ శతాబ్ది సంవత్సరంలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో మంచి పరిణామం అని చెప్పారు. ఇప్పటికే మూడు విభాగాల్లో బీఐఎస్ విద్యార్థి శాఖలను ఏర్పాటు చేశామని, మరొక నూతన శాఖను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఎఫ్‌డీపీ కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మీనాక్షి గణేశన్‌ను వీసీ సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణతులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తరశతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.